క్లుప్తంగా

భగవద్గీత కంఠస్థ పఠనంలో బంగారు పతకం



రెంటచింతల: కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్ నగరంలో ఈ నెల 17న ఆన్‌లైన్‌లో నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పఠనంలో రెంటచింతలకు చెందిన మోటమర్రి కనకమ్మ బంగారు పతకం అందుకుంది. శ్రీ గణపతి సచ్చిదానందస్వామి చేతులమీదుగా బంగారు పతకం అందుకున్నట్లు స్థానిక వెంకటేశ్వర స్వామి దేవస్థానం అధ్యక్షుడు నాళం పెదబాబు ఆదివారం తెలిపారు. బంగారు పతకం పొందిన కనకమ్మను మండల ఆర్యవైశ్య సంఘం పెద్దలు యేచూరి వెంకట సైదయ్య, నాళం నరసింహారావు, కట్టమూరి శ్రీనివాస శంకర్‌రావు, ఆకుల నర్శింహారావు, గుండా రామ్మూర్తి, నాళం చిన బాబు, యేచూరి కొండలు, పొట్టిమూర్తి రాంబాబు అభినందించారు.

రేపు శివాలయం వార్షికోత్సవం

రెంటచింతల: స్థానిక మల్లేశ్వరస్వామి దేవస్థానం(శివాలయం) వార్షికోత్సవం ఈ నెల 20వ తేదీ నిర్వహించనున్నట్లు దేవదాశాఖ ఈఓ గాదె రామిరెడ్డి, దేవస్థానం అధ్యక్షుడు పల్లెర్ల లక్ష్మారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు స్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించనున్నట్లు చెప్పారు. 10 గంటలకు లక్ష మల్లెలార్చన, 11 గంటలకు స్వామివార్ల శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు మంత్రపుష్పం, మంగళహారతి చేపట్టి అనంతరం భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. స్వామివార్ల శాంతి కల్యాణ వేడుకలలో వేలాది మంది భక్తులు పాల్గొని స్వామి ఆశీస్సులు పొందాలని కోరారు.

సత్‌ప్రవర్తనతో జీవించాలి



దాచేపల్లి: చిన్నారులు సత్‌ప్రవర్తన కలిగి జీవించేలా చూడాలని పాస్టర్ జీఎస్ ప్రసన్నకుమార్ అన్నారు. మండలంలోని కేసానుపల్లి క్రీస్తు లూథరన్ దేవాలయంలో సండేస్కూల్ చిన్నారులకు వేసవిలో నిర్వహించిన బైబిల్ శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. విద్యార్థులకు, సండేస్కూల్ టీచర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభువైన ఏసుక్రీస్తు చూపించిన మార్గంలో చిన్నారులను నడిపించాలని, చిన్న తనం నుంచే మంచి బోధనలు చెప్పి పవిత్రంగా జీవించేలా చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఏఈఎల్‌సీ డేలిగేట్ వినుకొండ బాబు, చర్చి డేలిగేట్ శ్రీపతి కాశయ్య పాల్గొన్నారు.

ఐదుగురు జూదరులు అరెస్టు

నాదెండ్ల: గ్రామ శివారులో పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఎస్సై జి. పుల్లారావు తెలిపిన వివరాల మేరకు.. గొరిజవోలు గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఐదుగురు జూదరులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.16,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వర్షం పడితే బస్టాండ్ చిత్తడే



నరసరావుపేట: ఎన్నాళ్లు గడిచినా ఆర్టీసీ బస్టాండ్ పరిస్థితి మారట్లేదు. ఏ చిన్నపాటి వర్షం కురిసినా నీరు ఆగి చిత్తడి చిత్తడిగా మారుతోంది. ఈ బస్టాండ్ నుంచి రోజూ వేలాదిమంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. నీరు నిలవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. శుక్ర, శనివారాల్లో పడిన వర్షంతో బస్టాండ్‌లోకి ప్రవేశించే మార్గాల్లో నీరు నిలిచిపోయింది. బస్టాండ్ పరిసర ఉన్న ప్రాంతాలు ఎత్తుగా ఉండటంతో వర్షపు నీరు బయటకు వెళ్లట్లేదు. బస్టాండ్ ముందున్న డ్రైనేజ్ కూడా సక్రమంగా లేక సమస్య తీవ్రమవుతోంది. ఇప్పటికైనా అధికారులు పరిస్థితిని చక్కదిద్దాలని ప్రయాణికులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో హరేరామ సంకీర్తన

నూజెండ్ల: హనుమత్ జయంతి ఉత్సవాలలో భాగంగా నూజెండ్లలో హనుమాన్ దీక్షా స్వాములచే హరేరామ సంకీర్తన ఆదివారం భక్తిశ్రద్ధలతో జరిగింది. విశ్వక్సేన పూజతో ప్రారంభమైన ఈ ఉత్సవాలలో భాగంగా ఆదివారం నగర ఉత్సవం జరిగింది. 19న గ్రామదేవతలకు పూజ, 20న స్వామి వారికి తోమాల సేవ, హనుమాన్ చాలీసా పారాయణం, 21న సహస్ర కలశాభిషేకం, 22న స్వామి వారికి విశేషాలంకరణ, సామూహిక హనుమత్ వ్రతాలు, ఇరుముడి కార్యక్రమం, గ్రామస్తుల సహకారంతో అన్నప్రసాద వితరణ, దీక్షా స్వాముల జాపాలి యాత్ర, 23న పూర్ణాహుతి, పీఠం ఉద్వాసన కార్యక్రమాలు ఉంటాయని అర్చకుడు రామ మోహనాచార్యులు తెలిపారు.

కందిపోతున్న అన్నదాతలు..

- ఎకరాకు 3 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడి
- భారీగా పతనమైన ధరలు
- పెట్టుబడులు రాక అల్లాడిపోతున్న కౌలు రైతులు



కళ్లంలో కందిపంటను శుభ్రం చేస్తున్న కూలీలు(ఫైల్)



రెంటచింతలలో నిల్వచేసిన కందులు

రెంటచింతల: రైతు పండించిన పంటకు ధర లేదు. మద్దతు లేదు. వాణిజ్య పంటల రైతులు ఊసూరుమంటున్నారు. ఎన్నో సంవత్సరాలుగా పత్తి, మిర్చి వంటి వాణిజ్య పంటలను సాగు చేసి చేతులు కాల్చుకున్న కొందరు రైతులు ఈ ఏడాది తక్కువ పెట్టుబడితో కంది పంటను సాగు చేశారు. చీడపీడలతో పూర్తిగా దిగుబడులు తగ్గిపోవడంతోపాటు మార్కెట్లో ధర కూడా భారీగా పతనం కావడంతో అన్నదాతలు కందిపోతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్, రబీలో మండలంలో తుమ్మకోట, మల్లవరం, రెంటచింతల, పాలువాయి తదితర గ్రామాలలో సుమారు 2,300 హెక్టార్లలో సాగుచేశారు. ఎకరా రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు కౌలుకు తీసుకున్న రైతులు సుమారు రూ.25 వేల నుంచి 30 వేల వరకు పెట్టుబడి పెట్టారు. ఎక్కువ మంది రైతులకు ఎకరాకు 3 నుంచి 5 క్వింటాళ్లకు మించి దిగుబడి రాకపోవడంతో పెట్టిన పెట్టుబడి రాకపోవడంతో దిక్కుతోచడం లేదని వాపోతున్నారు.

అకాల వర్షాలకు..

అకాల వర్షాల వలన కందిపంట పూత, పిందె రాలిపోవడంతో పాటు చీడపీడలు కారణంగా ఈ ఏడాది దిగుబడి పూర్తిగా తగ్గినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బహిరంగ మార్కెట్లో క్వింటా ధర రూ.6,500 వేల నుంచి 6,800 వరకు ఉన్నా వ్యాపారులు కొనుగోళ్లు చేయడానికి ముందుకు రాకపోవడంతో రైతులకు ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా రూ.7,550 కొనుగోలు చేస్తూ రైతులకు ఈ క్రాప్ బుకింగ్ అంటూ అనేక షరతులు పెట్టడంతో వారు అక్కడ కూడా అమ్ముకోలేకపోతున్నారు. కొందరు రైతులు వచ్చిన పంట అమ్మిన పెట్టుబడి కోసం చేసిన అప్పు కూడ తీరదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది కొందరు రైతులు పంట కోతలు కోసిన గిట్టుబాటు కాదనే ఉద్దేశంతో జీవాలు మేతకు ఎకరా రూ.3 వేల నుంచి 4 వేలకు ఇవ్వడం జరిగింది. మండలంలో కంది పంటను ఎక్కువగా కౌలు రైతులే సాగుచేశారు. ఈ క్రాప్ బుకింగ్ వంటి షరతులను తొలిగించి కంది పంటను రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని పలువురు కౌలు రైతులు కోరుతున్నారు.

గత ఏడాది కందిరైతుకు ఎంతో మేలు....

ఎకరాకు 6 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి రావడంతో పాటు అప్పటి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల నుంచి నేరుగా క్వింటాకు మద్దతు ధర రూ.8,500 నుంచి 10 వేలు చొప్పున కొనుగోలు చేయడం జరిగింది. ఆ ఏడాది చివరిలో బహిరంగ మార్కెట్లో క్వింటా కందులు రూ.11 నుంచి రూ.12 వేలకు ధర పలికింది.

16 ఎకరాలలో సాగుచేశా...



ఈ ఏడాది నేను ఎకరా రూ.10 వేల చొప్పున 16 ఎకరాలను కౌలుకు తీసుకుని కందిపంట సాగు చేశా. ఎకరాకు కౌలుతో కలిపి రూ.40 వేల వరకు పెట్టుబడి పెట్టా. దిగుబడి ఎకరాకు మూడు క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. రైతు సేవా కేంద్రంలో క్వింటా రూ.7,500 అమ్మినా ఎకరాకు రూ.18 వేల వరకు నష్టం వచ్చింది. గత ఏడాది రైతుభరోసా కేంద్రంలో కొనుగోలు చేసిన విధంగా రూ.8,500 నుంచి 10 వేల చొప్పున ఇప్పుడు కొనుగోలు చేసిన మాకు కొంత వరకు నష్టం తగ్గేది.

– నీనావత్ మంగ్లానాయక్, కౌలురైతు, పాలువాయి

దిగుబడి పూర్తిగా తగ్గింది



ఎకరా రూ.10 వేల చొప్పున 35 ఎకరాలను కౌలుకు తీసుకుని కందిపంట సాగు చేయగా మొత్తం 124 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. గిట్టుబాటు ధర లేదు. ఎకరాకు రూ.28 వేలు పెట్టుబడి అయింది. గత ఏడాది అప్పటి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రం ద్వారా రూ.8,500 నుంచి రూ.10 వేల వరకు రైతులకు చెల్లించి నేరుగా కొనుగోలు చేయడంతో రైతులకు గిట్టుబాటు అయింది.

–సోము చౌడారెడ్డి, కౌలురైతు, రెంటచింతల

గుడికి రూ.50 వేల విరాళం

పిడుగురాళ్ల: మండలంలోని జానపాడులోని పాతపాటేశ్వరి అమ్మవారి దేవాలయం పునఃనిర్మాణం కోసం రూ.50 వేల నగదును విరాళంగా ఆదివారం అందజేశారు. గ్రామానికి చెందిన ఉన్నం చిన్న పూర్ణయ్య, అన్నపూర్ణమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు ఉన్నం రామయ్య, ఉన్నం కోటీశ్వరరావు అందించారు. గ్రామ పెద్దలు ఉన్నం నరసింహారావు, ఉన్నం హనుమంతరావు, ఉన్నం నాగేశ్వరరావు, కూరపాటి కోటేశ్వరరావులతో పాటు మరో రూ.50 వేలు విరాళం అందజేశారు.

ఎస్సీ హాస్టల్‌లో వంట పాత్రలు చోరీ

నాదెండ్ల: గణపవరం శాంతినగర్ మూడో సచివాలయం సమీపంలో ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహంలో వంట పాత్రలు చోరీకి గురైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. కొన్నేళ్లుగా ఈ వసతి గృహానికి వార్డెన్‌గా తిరుపతయ్య, నైట్ వాచ్‌మెన్‌గా దేవి విధులు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల క్రితం తిరుపతయ్య సెలవు పెట్టారు. దేవి శనివారం రాత్రి హాస్టల్‌కు వెళ్లగా.. వంట గదిలో పాత్రలు కనిపించలేదు. చోరీకి గురైనట్లు గుర్తించి వెంటనే వార్డెన్‌కు సమాచారమిచ్చారు. ఆయన సూచన మేరకు ఆదివారం నాదెండ్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొందరు మహిళలు చెత్త ఏరుకున్నట్లు నటించి ఇలా చోరీలకు పాల్పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

• జీవం లేని నాగులేరు



నాగులేరులో పేరుకుపోయిన గుర్రెపు డెక్క

జీవనదిగా పేరొందిన నాగులేరు వ్యర్థాలమయంగా మారింది. నల్లమల అడవుల నుంచి ప్రవహించే నాగులేరు ప్రస్తుతం అధ్వానంగా మారింది. దాచేపల్లిలో ప్రవహించే నాగులేరు నీటిపై గుర్రెపు డెక్క బాగా పెరిగింది. సమీపంలో ఉన్న వ్యాపారులు దుకాణాల్లోని వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లను తెచ్చి పడవేస్తున్నారు. కొబ్బరి బొండాలు, కోళ్ల వ్యర్థాలు తెచ్చి గుట్టలు గుట్టలు పడవేస్తున్నారు. దీంతో నాగులేరు రూపులేకుండాపోయింది. నగర పంచాయతీ అధికారులు, పాలకులు నాగులేరు పరిరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– దాచేపల్లి



కోళ్ల వ్యర్థాలు



కొబ్బరిబొండాలు..

ఎస్సీ, ఎస్టీలు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారునాయక్



విజయపురిసౌత్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన కల్పిస్తున్న దారునాయక్

విజయపురిసౌత్: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలు ఉన్నత శిఖరాలకు ఎదగాలని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.దారు నాయక్ అన్నారు. మాచర్ల మండలం విజయపురిసౌత్‌లో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టంపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన పెంచుకోవాలన్నారు. అట్రాసిటీ చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవాసంఘం పల్నాడు జిల్లా వైస్ ప్రెసిడెంట్ బాణావత్ వెంకటేష్ నాయక్, మహబూబ్ నగర్ ఎస్సీ, ఎస్టీ కోర్టు పీపీ రాజేశ్వరావు, హైకోర్టు అడ్వకేట్ కృష్ణా రెడ్డి, ఏఎస్ఐ రామకృష్ణ రెడ్డి, ప్రిన్సిపాల్ శామ్యూల్ జోబ్, టీడీపీ ఎస్టీ సెల్ మాచర్ల నియోజకవర్గ అధ్యక్షుడు వజ్రం నాయక్, నాయకులు నేరేటి వీరాస్వామి యాదవ్, గుండలా నాయక్, లాయర్ చందన్ సింగ్ నాయక్, స్వామి నాయక్ పాల్గొన్నారు.

పురవీధులలో తిరంగా ర్యాలీ



రెంటచింతలలో నిర్వహించిన తిరంగా ర్యాలీలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతల ఎంపీడీఓ కార్యాలయం నుంచి గ్రామ పురవీధులలో తిరంగా ర్యాలీని ఆదివారం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షులు బోయ నాగిరెడ్డి ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సేవా సంస్థల కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఈ ర్యాలీలో జాతీయ పతాకాలను చేబూని భారతమాతకీ జే అంటూ నినాదాలు చేశారు. ఆ పార్టీ నాయకులు పోకూరి కాశీపతి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు సైనికుల చూపిన ధైర్యం, వారు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ ఈ తిరంగా ర్యాలీని చేపట్టినట్లు తెలిపారు. కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షులు ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడి అనంతరం దేశ ప్రధాని మోదీ నేతృత్వంలో భారత సైనికులు ఆపరేషన్ సిందూర్ చేపట్టి పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వసం చేసి దేశ శత్రువులకు తగిన గుణపాఠం చెప్పార న్నారు. దీనిని పురస్కరించుకుని దేశ భద్రతను కాపాడుతున్న సైనికులను ప్రత్యేకంగా గౌరవించేందుకు ఈ ర్యాలీని నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాశం మట్టారెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షులు మూలి రాజారెడ్డి, ఆర్య వైశ్య సంఘం పెద్దలు యేచూరి వెంకట సైదయ్య, కాశీ పతి, ఎస్.పెదబాబు, ఎ.నర్సింహారావు, జి.రామ్మూర్తి, జి.కాశిరెడ్డి, వి.సాంబశివారెడ్డి, పి.శివారెడ్డి, కె.సైదులు, బీజేపి, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో..

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా త్రివిధ దళాలకు మద్దతుగా ఆదివారం జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఆర్ అండ్‌బీ బంగ్లా నుంచి మార్కెట్ యార్డు వరకు నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, టీటీడీ పాలక మండలి సభ్యులు జంగా కృష్ణమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ఊచకోత కోసిన భారత త్రివిధ దళాలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సైనిక ఉద్యోగులు ఐతం నాగేశ్వరరావు(నాయక్), మొగిలి వెంకటేశ్వర్లు నాయక్(సుబేదార్) పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక



హాజరైన 1998-1999 మన్నెం పుల్లారెడ్డి హైస్కూల్‌లో చదివిన విద్యార్థులు

- 1998-1999 పది బ్యాచ్ విద్యార్థులు
- సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన స్నేహితులు
- మన్నెం పుల్లారెడ్డి హైస్కూల్‌లో సందడి

పిడుగురాళ్ల: పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 1998-1999 మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులంతా ఆదివారం కలుసుకున్నారు. సుమారు 270 మంది విద్యార్థులకు గాను 200 మంది హాజరయ్యారు. చిన్నతంలో చేసిన గొడవలను గుర్తు చేసుకుంటూ ఒకరిని ఒకరు ఆట పట్టించుకున్నారు. అంతేకాకుండా వారు గడిపిన స్కూల్, గదులను గుర్తు చేసుకొని కొన్ని బాధలు, గొడలపై కొన్ని రాతలను నెమరు వేసుకున్నారు. అందరూ కలిసి ఆనందంగా ఆటలు, పాటలు, కేరింతలు కొట్టారు. అనంతరం అందరు కలిసి భోజనం చేశారు. ఫొటోలకు ఫోజులిచ్చుకొని ఫొటోలు దిగారు. అనంతరం ఒక వాటప్స్ గ్రూప్ క్రియేట్ చేసుకొని మనమంతా కలిసి ఉండాలని, ఎవరికి ఏ కష్టమొచ్చిన తోడు ఉండాలని నిర్ణయించుకునానరు. ఒకరూ ఆలింగనం చేసుకోవటం, కొంత మంది అయితే వారి స్నేహితుల యొక్క ఆటో గ్రాఫ్‌లు తీసుకున్నారు. తీరా వెళ్లిపోయే సమయానికి ఒకరిని ప్రతి ఒక్కరి కళ్లల్లో ఏదో బాధ, కొంత మంది అయితే స్నేహితులను వదలి వెళ్తున్నామని వీడ్కోలు పలికారు.

ఆనందంగా ఉంది



ఎక్కడో మలేషియాలో ఉన్న తనను తన స్నేహితులు గుర్తించి సమ్మేళానికి పిలవటం చాలా ఆనందంగా ఉందని. కానీ ఇక్కడకి వచ్చాక తెలిసింది ఇంత కన్న జీవితంలో ఎంత డబ్బు పెట్టి కొనలేని ఆనందం, జ్ఞాపకాలను ఈ రోజు సంపాదించామని. మళ్లీ కలుసుకోవాలని నిర్ణయించుకున్నాం.

– బొగ్గవరపు శ్రీనివాసరావు, మలేషియా

అందరూ కలవడం సంతోషం



పూర్వపు విద్యార్థులందరికి ఒక గ్రూప్ క్రియేట్ చేసి ఏడాది నుంచి అందరిని ఆ గ్రూప్‌లో యాడ్ చేసుకుంటూ వచ్చాం. సుమారు 270 మంది విద్యార్థులు అయితే అందులో 200 వరకు ఈ కార్యక్రమానికి వచ్చారు. ఆరు నెలల నుంచి ఈ కార్యక్రమానికి సన్నహాలు చేశాం. ఇలా అందరం కలపటం నాకు ఎంతో ఆనందంగా ఉంది.

– పల్నూరి భరత్‌కుమార్, పిడుగురాళ్ల

క్షణం తీరిక లేని జీవితం నుంచి..



క్షణం తీరక లేక జీవితాన్ని కదుపుతున్నాం. కానీ మా స్నేహితుల గ్రూప్ చూస్తే రోజు అంతా చేసిన ఆలసట అంతా ఒక్కసారిగా పోతోంది. అలాగే ఈరోజు ఇక్కడకి వచ్చిన తర్వాత నా జీవితంలో ఇలాంటి రోజు ఎప్పటికి రాదు. ఒక అనుభూతిగా మిగిలిపోతోంది.

– బొగ్గవరపు నరేష్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, హైదరాబాద్

ఆక్రమణల తొలగింపు



నరసరావుపేట రూరల్: ములకలూరు సమీపంలో ఎన్ఎస్‌పీ కాలువను ఆక్రమించి అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను ఆదివారం తొలగించారు. సత్తెనపల్లి రోడ్డులో ఏర్పాటు చేసిన రియల్ ఎస్టేట్ వెంచర్ కోసం ఎన్ఎస్‌పీ కాలువలను ఆక్రమించడంతోపాటు రోడ్ల నిర్మాణాలను సంస్థ చేపట్టింది. దీనిపై ప్రజా సంఘాలు, రైతులు తీవ్ర అభ్యంతర వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ వెంచర్‌పై చర్యలు తీసుకోవాలంటూ పీడీఎం నాయకులు పలు మార్లు అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో సంస్థ ఆ నిర్మాణాలను ఆదివారం తొలగించడం ప్రారంభించింది. అధికారుల ఒత్తిడి కారణంగా ఈ చర్యకు పూనుకున్నట్టు తెలుస్తోంది. తొలగింపును పీడీఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు పరిశీలించారు.

ఆయిల్ మిల్‌లో అగ్నిప్రమాదం

నరసరావుపేట రూరల్: సత్తెనపల్లి రోడ్డులోని ఆంజనేయులు ఆయిల్ మిల్‌లో ఆదివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఫైర్ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. ఆయిల్ మిల్‌లోని జనరేటర్ రూమ్‌లో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన కార్మికులు అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. మిల్‌లోకి వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకున్నారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

చిలకలూరిపేట టౌన్: చిలకలూరిపేట మండలం కట్టుబడివారిపాలెం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం ఉచిత మెగా నేత్ర వైద్యశిబిరానికి స్పందన లభించింది. స్వచ్ఛ సేవ టీం (కట్టుబడివారిపాలెం, యక్కలవారిపాలెం, ఏపూరివారిపాలెం) ఆధ్వర్యాన జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి సంయుక్త సహకారంతో శిబిరం ఏర్పాటైంది. ఆస్పత్రి వైద్యులు మేఘన, ధృవ్, సిబ్బంది పాల్గొన్నారు. 116 మందికి పరీక్షలు చేసి 50 మందికి శస్త్ర చికిత్సలు చేయాలని నిర్ధారించారు. ఈ మేరకు క్యాంపు కోఆర్డినేటర్ బి.సైదులు బాబు తెలిపారు. సోమవారం వీరికి ఉచిత శస్త్రచికిత్సలు చేయనున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో కంటి సమస్యలపై అవగాహన పెంచడానికి స్వచ్ఛ సేవ టీం ఆదివారం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసింది. నల్లజర్ల ప్రసన్నకుమార్, నక్క బాజీబాబు, కొంగర వీరేంద్రనాథ్, యక్కల లక్ష్మీనారాయణ, మజ్జిగ శ్రీనివాసరావు, రాజేష్, ముత్యాల కోటయ్య, సుంకర గౌరీ శంకర్, బొమ్మసాని ప్రసాద్, నాగార్జున, బోయపాటి మల్లికార్జున, గుంటుపల్లి రామకోటేశ్వరరావు, వీరాంజనేయులు, మేరం నాగబాబు, కోటయ్య పాల్గొన్నారు.

దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడి అమానుషం



మాట్లాడుతున్న సుబ్బారావు

చిలకలూరిపేట టౌన్: తిరుపతి జిల్లా చంద్రగిరి సమీపంలోని విద్యానికేతన్ ఇంజినీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం విద్యార్థి జేమ్స్‌పై జూనియర్ విద్యార్థి యశ్వంత్ నాయుడు తన మిత్రులతో కలిసి దారుణంగా దాడి చేసిన ఘటనను భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు ఆదివారం తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హాకీ స్టిక్, కత్తులతో దాడి చేయడమే కాకుండా అమానుషంగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే దోషులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పి. శ్రీకృష్ణదేవరాయలు, నలమాల జీవరత్నం, కొర్రపాటి విజయకుమార్, నల్లమల ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు

నాదెండ్ల: మండలంలోని గణపవరంలో లోఓల్టేజీ సమస్యపై సాక్షిలో ఇటీవల వచ్చిన కథనంపై విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. గతేడాది ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు అధికారులు దిమ్మె ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ బిగించలేదు. ఆదివారం ఈ ప్రాంతంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంటు స్తంభాలు ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేశారు.